క్లుప్తంగా

వత్సవాయి ఎంపీపీ చెంబేటి మృతి



దబ్బాకుపల్లి(వత్సవాయి): మండల పరిషత్ అధ్యక్షుడు చెంబేటి వెంకటేశ్వర్లు(60) సోమవారం మృతిచెందారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స తీసుకుంటున్నారు. హైదరాబాద్‌లో మృతిచెందిన ఆయన్ను స్వస్థలం దబ్బాకుపల్లికి తీసుకువచ్చారు. వెంకటేశ్వర్లు నాలుగు పర్యాయాలు సొసైటీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన చెంబేటి ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితులు. ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు చెంబేటి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెంబేటి మృతి పార్టీకి, వ్యక్తిగతంగా తమకు తీరని లోటన్నారు. నియోజకవర్గంలోని పలువురు సర్పంచులు, సొసైటీ అధ్యక్షులు, ఎంపీటీసీలు చెంబేటికి ఘనంగా నివాళులర్పించారు.

ఎంఈవోగా చిట్టిబాబు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండల విద్యాశాఖాధికారిగా చిట్టిబాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహించిన ఎంఈవో రవీందర్ పెనుగంచిప్రోలు ఎంఈవోగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కంచికచర్ల ఎంఈవోగా పనిచేస్తున్న చిట్టిబాబు ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు రాబట్టేలా కృషి చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లు పంపిణీ

గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ మెయిన్ పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత కనపర్తి నరసింహారావు సోమవారం మధ్యాహ్న భోజన ప్లేట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తమ వంతుగా ప్లేట్‌లు అందించటం సంతోషంగా ఉందన్నారు. మాజీ సర్పంచ్ నాగమణి, గ్రామ పెద్దలు కనపర్తి ప్రసాద్, బండి రాజు, వీరబాబు, రామరాజు, వెంకటరత్నం, ప్రధానోపాధ్యాయుడు నేలవెల్లి రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాతకక్షల నేపథ్యంలో మహిళపై దాడి

నందిగామ: పాత కక్షల నేపథ్యంలో ఒక మహిళపై మరో మహిళ దాడి చేసిన ఘటన సోమవారం నందిగామ మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం మండలంలోని లింగాలపాడు గ్రామానికి చెందిన చిట్టెమ్మ అనే మహిళకు అదే గ్రామానికి చెందిన శ్యామల అనే మహిళకు పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉదయాన్నే ఇంటి వద్ద శుభ్రం చేస్తున్న చిట్టెమ్మపై శ్యామల కర్రతో దాడి చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నవ్వుతూ జీవించడమే జంధ్యాలకు అసలైన నివాళి

విజయవాడ కల్చరల్: నవ్వుతూ జీవించమే దర్శకుడు జంధ్యాలకు అసలైన నివాళి అని విద్యావేత్త డాక్టర్ ఎమ్‌సీ దాస్ అన్నారు. సీ రామమోహనరావు కల్చరల్ ఆర్గనైజేషన్, జంధ్యాల మిత్రులు, సన్నిహితులు ఆధ్వర్యంలో సోమవారం సినీ దర్శకుడు, నాటక రచయిత జంధ్యాల 22 వర్ధంతి కార్యక్రమాన్ని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్యా కళాక్షేత్రంలో నిర్వహించారు. ఎమ్‌సీదాస్ మాట్లాడుతూ తెలుగు సినిమాలో హాస్యానికి పెట్టని కోట జంధ్యాల అని అభివర్ణించారు. జంధ్యాల ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో చదువుకున్నారని తెలిపారు. నాటక రచయితగా, సినీ మాటల రచయితగా ఇక్కడే పునాది పడిందన్నారు. ఆయనతో అనుబంధం గుర్తు చేసుకున్నారు. వెనిదండ్ల హనుంతయ గ్రంథాలయంలో ఆయన నాటికలు ప్రదర్శించినట్లు తెలిపారు. అభిరుచి సాంస్కృతిక సేవా సంస్థ కార్యదర్శి పులిపాక కృష్ణాజీ మాట్లాడుతూ తెలుగు సినిమాల్లో సున్నితమైన హాస్యాన్ని ప్రవేశపెట్టిందని జంధ్యాల అని గుర్తు చేశారు. వివిధ సంస్థల ప్రతినిధులు చివుకుల హరగోపాల్, చింతకాయల చిట్టిబాబు, పీవీఎల్ నృసింహం, సురేష్, బొగ్గవరపు రాధాకృష్ణ, శ్యాం ప్రసాద్ రంగస్థల ప్రమోక్త డాక్టర్ ఎమ్ఎస్ చౌదరి పాల్గొన్నారు. అభిమానులు జంధ్యాల సినిమాలలోని హాస్య సన్నివేశాలను గుర్తు చేసుకున్నారు.

ఉద్యోగులకు బాసటగా సీఎం జగన్

- ఉపాధ్యాయులు, ఉద్యోగులతో ఆత్మీయ సమావేశం
- పాల్గొన్న నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగులకు బాసటగా నిలుస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు అన్నారు. పట్టణంలోని ఓసీ క్లబ్‌లో ఆదివారం రాత్రి ఉపాధ్యాయులు, నాన్ గెజిటెడ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా పలువురు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నాయకులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముఖ్యంగా ఉద్యోగుల సంక్షేమం, శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే జీపీఎస్ అమలు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీపీ



ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీపీ ఉద్యోగుల విలీనం, పీఆర్సీ, తదితర నిర్ణయాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకోవటమే కాకుండా అమలు చేస్తున్నారని చెప్పారు.

ఉద్యోగులు అండగా ఉంటేనే..

ప్రభుత్వ ఉద్యోగులు అండగా ఉంటేనే ప్రభుత్వం ప్రజలకు మంచి చేయగలుగుతుందని జగన్‌మోహనరావు అన్నారు. ఇది మన ప్రభుత్వమని, మనమంతా ఒక కుటుంబంగా కలిసి పని చేయాలని ఆయన సూచించారు. ఉద్యోగులకు అందాల్సిన డీఏ బకాయిల విడుదలతో పాటు పింఛన్‌దారులకు మేలు జరిగేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం కావాలనే ఉద్యోగులను రెచ్చగొడుతూ తప్పుదోవ పట్టించేందుకు చూస్తున్నారని, అటువంటి వాటిని ఉద్యోగులు నమ్మవద్దని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజలకు మంచి చేస్తున్నారని, ఉద్యోగులు కూడా ప్రభుత్వానికి అండగా ఉండి చేస్తున్న మంచిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సీపీఎస్ స్థానంలో ఏర్పాటు చేసిన జీపీఎస్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని జగన్‌మోహనరావు అన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడివాడ సాంబశివరావు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, కరిముల్లా, ఉద్యోగ సంఘ నాయకులు శ్యాం, శివారెడ్డి, కుంచం లక్ష్మీనారాయణ, వడ్లమూడి శ్రీను, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలోని రాజగోపాల స్వామి కల్యాణ మండపంలో సోమవారం రాత్రి గ్రామ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. పేదలకు మంచి చేసే ప్రతి పనిలో ప్రతిపక్ష టీడీపీ నాయకులు అడ్డుపడుతున్నారని, చివరకు కోర్టులను సైతం ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏ ఇంటికెళ్లినా సంక్షేమ పథకాలు అందాయని సంతోషంగా చెబుతున్నారని తెలిపారు. ఇళ్ల వద్దకు వెళ్లిన తమకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. పాదయాత్ర, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 30 లక్షల మందికి పైగా ఇళ్లు, ఇళ్ల స్థలాలను అందించి గ్రామాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో



మాట్లాడుతున్న విప్ ఉదయభాను

చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోతో మైండ్ గేమ్ ఆడుతున్నారని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌కు ప్రణాళిక లేకుండా ముందుకు సాగుతూ ఎవరో ఇచ్చిన స్క్రిప్టును చదువుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, యువ నాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, గ్రామ కన్వీనర్ జొన్నాబొట్ల సతీష్ శర్మ, మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, సచివాలయ కన్వీనర్ డి.జానకిరామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పుల రవి కుమార్, మాతంగి వెంకటేశ్వర్లు, చలమల శ్రీనివాసరావు, మోరె వినోద్, చిలుకూరి శ్రీనివాసరావు, బాలసైదా, గుర్రం నరసింహారావు, బాలయ్య, దర్శినాల కమలేష్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రోత్సాహానికే జగనన్న ఆణిముత్యాలు

రాష్ట్ర ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొండారెడ్డి

నందిగామ: విద్యార్థులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహిస్తోందని రాష్ట్ర ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి అన్నారు. మండలంలోని పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన పలువురు విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్స్, నగదు బహుమతులను కొండారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీతత్వంతో క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస ప్రసాద్, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చందర్లపాడులో...

చందర్లపాడు: మండల కేంద్రమైన చందర్లపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పలువురు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సర్టిఫికెట్, మెడల్స్ అందజేశారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలలో పాఠశాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినికి యార్లగడ్డ



పెద్దవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో కొండారెడ్డి తదితరులు

రామనరసింహం జ్ఞాపకార్థం రూ.15 వేలు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కస్తాల పున్నమ్మ, ఎంపీటీసీ సభ్యుడు కోట సత్యం, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు సత్కారం

వీరులపాడు: మారుమూల ప్రాంతాలకు చెందిన నిరుపేద విద్యార్థులు సైతం ఉన్నత విద్య అభ్యసించాలనే సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య అన్నారు. వీరులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబర్చిన జగనన్న ఆణిముత్యాలను సోమవారం ఆమె సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మండూరి ప్రకాశరావు, సర్పంచ్ కన్నమాల సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందనలో అర్జీలు నిల్

కంచికచర్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిందని తహసీల్దార్ శంకరబాబు తెలిపారు. కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యల పరిష్కారం కోరుతూ ఎటువంటి అర్జీలు రాలేదని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.బాలశంకరరావు, మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్, ఏపీఎం కోట భాస్కరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీరులపాడు స్పందనకు ఆరు అర్జీలు

వీరులపాడు: స్పందనకు వచ్చే ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆశయ్య నాయక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మొత్తం ఆరు అర్జీలు అందాయన్నారు. వాటిని పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

చదువుతో ఏదైనా సాధించవచ్చు

విద్యార్థులను సత్కరించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: చదువు ప్రతి ఒక్కరికీ అవసరమని చదువుతో ఏదైనా సాధించవచ్చని శాసన సభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. ఇటీవల విడుదలైన ఏపీఎంసెట్, జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో ప్రతిభ చూపిన చైతన్య కళాశాల విద్యార్థులను సోమవారం ఆయన అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించటం హర్షణీయమన్నారు. విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. ఒక విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరితే ఆ కుటుంబం బాగుపడుతుందని సూచించారు. దైనందిన జీవితంలో చదువు ప్రతి ఒక్కరికీ అత్యవసరమని గ్రామీణ ప్రాంత ప్రజలకు చదువు ఆవశ్యకతను వివరించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావును కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అమరనేని రమేష్‌బాబు, డైరెక్టర్ కార్తీక్, అకడమిక్ డైరెక్టర్ శాంతి ప్రత్యూష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పట్టణ అభివృద్ధే ధ్యేయంగా కృషి

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక చెరువు కట్టమీద ఉన్న ఆంజనేయ స్వామి వారి ఆలయం సమీపంలో ఊర చెరువు అలుగు వద్ద రూ.30 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటుచేస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను సోమవారం ఉదయభాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 13, 15 వార్డుల ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకే ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గతంలో ఈ బ్రిడ్జి 2 మీటర్ల వెడల్పుతో ఇరుకుగా ఉండి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుగా ఉండేదన్నారు. స్థానికుల అభ్యర్థనతో పాటు స్థానిక నాయకుల సూచనల మేరకు మరింత పొడవు, వెడల్పుతో విశాలమైన



చెరువు అలుగు వద్ద నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన నిర్మాణం పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు తన్నీరు నాగేంద్ర, జాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ రవీంద్రకు సన్మానం



రవీంద్రను సన్మానిస్తున్న ఎంఈఓ కార్యాలయ సిబ్బంది

పెనుగంచిప్రోలు: మండల ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించిన డి.రవీంద్రను సోమవారం కార్యాలయంలో సిబ్బంది, ఉపాధ్యాయులు శాలువతో సన్మానించారు. జగ్గయ్యపేట ఎంఈఓగా పని చేస్తూ పెనుగంచిప్రోలు ఇన్‌చార్జిగా ఇప్పటివరకు వ్యవహరించిన రవీంద్ర పూర్తికాలపు ఇన్‌చార్జిగా పెనుగంచిప్రోలు వచ్చారు. ముండ్లపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఎ.సూరిబాబు ఉద్యోగోన్నతిపై విజయవాడ రూరల్ ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గూడపాటి లావణ్య, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నరాల మధుసూదనరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్రంలో చదువుల విప్లవం



పెనుగంచిప్రోలులో బహుమతి అందజేస్తున్న సర్పంచ్ పద్మకుమారి తదితరులు

పెనుగంచిప్రోలు: రాష్ట్రంలో చదువుల విప్లవం సాగుతోందని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా సోమవారం కొళ్లికూళ్ల జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ముగ్గురికి నగదు ప్రోత్సాహకంతో పాటు మెడల్స్ అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నలగడ్డ కిషోర్, సొసైటీ అధ్యక్షుడు కోనంగి ముక్కంటి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాధవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు రేగండ్ల నాగత్రిశూల్, బాడిశ తరుణశ్రీ, పెద్ది వంశీలకు సర్పంచ్ పద్మకుమారి నగదు బహుమతితో పాటు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, హెచ్‌ఎం కె.జలజ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి అడ్డుపడుతున్న సర్పంచ్

పెండ్యాలలో జరిగిన గ్రామ సభలో గ్రామస్తుల ఆరోపణ

పెండ్యాల(కంచికచర్ల): పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేస్తుంటే సర్పంచి గ్రామంలో జరిగే అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలోని పెండ్యాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ సచివాలయం వద్ద సోమవారం గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు మండల పరిషత్ నుంచి రూ.50 లక్షల నిధులు మంజూరుచేసి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అయితే గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు సర్పంచి అడ్డుపడుతున్నారని కనీసం అభివృద్ధి పనులకు తీర్మానాలు ఇవ్వటం లేదని మండిపడ్డారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసే సమయంలో నీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం విద్యుత్ మోటారు అమర్చారని అన్నారు. అయితే ఆ విద్యుత్ మోటారు మరమ్మతుకు గురయితే మండల పరిషత్ నుంచి రూ.45 లక్షల నిధులు మంజూరు చేయించి మోటారు మరమ్మతు పనులు చేయించామన్నారు. కాని నిధులు డ్రా చేసేందుకు ఎంబుక్ చేయాలని పంచాయతీ తీర్మానం చేయాలని అధికారులు తెలియజేశారని, పంచాయతీ సర్పంచి తీర్మానం చేయటం లేదని ఆరోపించారు. గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు నిరంతరం సర్పంచి అడ్డుపడుతున్నారని దీంతో అభివృద్ధి కుంటుపడుతోందని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో అభివృద్ధికి అడ్డుపడుతున్న సర్పంచిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు షేక్ బడే హజరత్, ఏఎంసీ డైరెక్టర్ షేక్ చాన్ బహదూర్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ గౌస్, ఖయూం పాషా, ఆదినారాయణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



పెండ్యాలలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీపీ మలక్‌బషీర్

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

ఆర్డీఓ రవీంద్రరావు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

నందిగామ: అర్జీల రూపంలో అందిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్డీఓ రవీంద్రరావు తెలిపారు.స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఆరు అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని ప్రతి మండల కేంద్రాలతో పాటు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

పర్యాటక ప్రదేశంగా అంబేడ్కర్ స్మృతివనం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడలోని స్వరాజ్య మైదానంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, స్మృతివనాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దనున్నట్లు మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మృతివనం మొత్తం విస్తీర్ణం 19.4 ఎకరాలు కాగా అందులో 8.9 ఎకరాలను పచ్చదనానికి కేటాయించామని తెలిపారు. ఈ హరిత హారంలో మొఘల్ గార్డెన్ ల్యాండ్ స్కేపింగ్ భాగాలు, వెదురు ఫ్రేమ్‌లో భోగన్ విల్లా మొక్కల, గులకరాళ్ల నమూనాలు, రంగురంగుల పూలల్లో దర్శనమిచ్చే జాతీయ పక్షి నెమలి కనిపించనున్నాయని చెప్పారు.

జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష



సచివాలయాల కార్యదర్శులు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ మల్లేశ్వరరావు

జగ్గయ్యపేటఅర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమంపై సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 23 వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు వారి వారి పరిధిలో ఉన్న ప్రతి గృహాన్ని సందర్శించి వివిధ సంక్షేమ పథకాల కింద అర్హులై ఉండి లబ్ధి పొందని అర్హుల పత్రాలు పరిశీలించి నమోదు చేసుకుంటారని తెలిపారు. నోడల్ అధికారులతో రెండు టీములను ఏర్పాటుచేశామని, వచ్చే జూలై నెల 1 వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు సచివాలయాల వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపుల్లో నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి సేకరించిన పత్రాలను పరిశీలించి అర్హులను గుర్తించి అదే రోజున కుల, ఆదాయ, జనన-మరణ పత్రాలను అందజేస్తారని తెలిపారు.